

# ప్రకాశరావు కథ

జీవితం వడ్డించిన విస్తరిలా సమకూడినా, ఒక్కొక్కప్పుడు ఆ వడ్డించిన పదార్థాల్ని సుష్ఠుగా భోంచేసి బేవ్‌మని తేన్చేయోగం పట్టని మనుష లెందరో ఉంటారీ విచిత్ర సృష్టిలో. అయినదానికీ కానిదానికీ అఱ్ఱులు చాచి, భూమీ ఆకాశమూ పట్టకుండా అయిపోయి, చివరకు చేతికి చిక్కిందానివల్ల ఏ అనుభవాన్నీ పొందలేక డీలాపడిపోయే మనుషులకు నిదర్శనం చూపించాలంటే ప్రకాశరావునే చెప్పాలి. ఎవర్నడిగినా ప్రకాశరావు ఉన్నవాడే నంటారు. పదెకరాల మావిడితోటా; ఉళ్ళో, ఆకాశంలో చుక్కల్లా చెదిరి, ఆకాశమంత ఎత్తు, అద్దెల్ని తెచ్చిపెట్టే నాలుగు మేడలూ, ఆ మాటనే నొక్కి చెప్తాయి. తల్లికీ తండ్రికీ అల్లారు ముద్దుగా పెరిగిన పెద్దకొడుకు కావడంవల్ల, ఓ తమ్ముడూ, ఓ చెల్లెలూ తన వెనక ఉన్నా ఆ యింట్లో అతగాడు తన మాటే నిరాఘాటంగా చెల్లించుకునేవాడు నేనూ, ప్రకాశరావూ వీధిబళ్ళో గుంట ఓనమాలు మొదలు పెట్టేం దగ్గర్నుంచీ తోడుతోడుగా తిరిగిన వాళ్ళమే. స్కూల్లో చదువు పూర్తయిపోయిం తర్వాత, ఊళ్ళో కాలేజీ ఉన్నా, ఉన్న ఊళ్ళో చదువుకుంటే పరప తేమిటని ప్రకాశరావు పట్నం

వెళ్తా నన్నాడు. తండ్రి కాదనలేదు. నెల నెలా హాస్టలుఖర్చులకూ, చేతిఖర్చులకూ మళ్ళీ కొడుకు దగ్గర్నుండి తిగెటప్రమే యం లేకుండానే డబ్బుసరఫరా చేసేవాడు. అక్కడ చదువు వెలగబెట్టిన రోజుల్లో ప్రకాశరావు చూడని సినిమా లేదు. చందా యివ్వని నాటకసమాజం లేదు. నువ్వా ముందా నేను ముందా అని చదువూ, ఝల్సా పోటీపడి చేసిన కుస్తీలో ఝల్సాయే గెల్చింది. అందుకు ఫలితంగా ప్రకాశరావు బియ్యే ఒక సంవత్సరమూ బియ్యల్ మరో రెండు సంవత్సరాలూ ఎక్కువ చదివిగాని పరీక్షలు నెగ్గడానికి వీల్లేకపోయింది. ఏమయినా చదువుకునే రోజుల్లో చీకూ చింతా అంటే ఏమిటో ఎరగడు ప్రకాశరావు. కడుపు నిండిన బేర మవడంవల్ల పుస్తకం చేత్తో పుచ్చు కుని చదువుకుందా మనుకుంటూనే భవి ష్యత్తులోకి జారిపోయేవాడు. భవిష్యత్తు ఒక బంగారు పంటలా కనిపించేది. నిజానికి అది ఎవరికైనా అలాగే కనిపి స్తుంది. పూటకు టికానా లేనివాడుకూడా మర్నాడు తన కెలాగో ఒకలాగ పది రూపాయలు వస్తే ఏంచెయ్యడం అనే అంచనా వేస్తాడు. ఈ అంచనా పేలపిండి ముంతవవైనా, ఆలోచిస్తున్నంత సేపూ అందువల్ల ఆనందం కలుగడం లేదని ఎవరు చెప్పగలరు? నిజానికి భవిష్యత్తు ఉత్త చీకటిమయమని ఎవరన్నా అంటే, ఆమాట అబద్ధం. — అందుకనే ప్రకాశ రావుకు భవిష్యత్తులో ఎన్నో రంగులు కనపడేవి. రకరకాల దృశ్యాలు రూపులు దిద్దుకుని పలకరించేవి. గాలికి చివర్లు ఎగిరే పొడుగాటి నల్లనిగౌనూ, ఆ గౌను అంచులమీద కళ్ళు నిలిపి అది సృష్టించే వెలుగు నీడల్లో తమ భాగ్యా భాగ్యాలను బేరీజు వేసుకుంటూ గుంపుగా తనవెంట కదిలే క్లయంట్లూ. తాను అవునన్నదే అవునని, కాదని వాదించింది. ఆమో దించి, చిరునవ్వుల్తో చెవులు దోరబెట్టు కుని వినే జడ్జీలూ, తన గర్జనలకు హడిలి పోయి, ఎలుకల్లా కుంచించుకుపోయి అటూ యిటూ చిందులు తొక్కే ప్రతి పక్షపు ప్లీడర్లూ—ఇవే బొమ్మలు ఎప్పుడూ భవిష్యత్తులో సినిమా బొమ్మల్లా చకచకా జరుగుతూండేవి. ఇవి చూస్తూంటే తనంటే తనకి గర్వం; తన శక్తిమీద తనకు నమ్మకం; తనమీద తనకు అంతు లేని మోజు — ఇవన్నీ పరవళ్ళు తొక్కేవి. అయితే ఈ బొమ్మలన్నిటి కంటే విశిష్టమైన మరో బొమ్మసంగతి కూడా చెప్పాలి. మెరీనాబీచీలో గుంపులు గుంపులుగా పోయే వయ్యారి వాలుగం టుల్ని చూచీ, క్లాసుల్లో సిగ్గు లొలక పోస్తూ, కేవలం తమ అందం ప్రద ర్శించుకోవడానికి కాలేజీ కొచ్చే చక్కెర బొమ్మల్ని చూచీ ఓ బొమ్మని రూపు కట్టించుకోవడానికి ప్రయత్నించాడు మా ప్రకాశరావు. కారుమేఘాలు విరిసి, భోరున వాన కురుస్తోంటే తళుక్కున




మెరిసి దారిచూపే మెరుపు తీగకు మల్లే ఆ బొమ్మకూడా తన జీవితంలో ఓనాడు అడుగు పెడ్తుందని కలలు కంటుండే వాడు. మళ్ళీ మళ్ళీ చూడా లనిపించే అందం, అందానికి తగ్గ మంచితనం, అన్నిటికీ మించిన చదువూ, కట్టుకున్న వాడి అడుగులకు మడుగులొత్తే అణ కువా — ఇన్ని హంగులు కలిగిన ఆ బొమ్మ అలా అస్తమానం అతని భవి ష్యత్తు తాలూకు బొమ్మల్లోకి తొంగి చూస్తూనే ఉండేది. — ఇంతకీ ఆ ఉహా సుందరికోసం ఎక్కడని వెతకడం? ఆవిణ్ణి ఎలా కనుక్కోవడం అంటూ ఆలోచిస్తూ ఉన్నట్టుండి దిగాలుపడిపోతూ ఉండేవాడు ప్రకాశరావు.

నిజానికి ఈ విషయంలో ప్రకాశరావు కంటే ఎక్కువ మధనపడి అలాతకుత లమై పోయిన వ్యక్తి అతగాడి తల్లి

పద్మావతమ్మగారు. చిన్నప్పుడు తన కొడుకు ఎత్తు పీటమీద కూచుని, తల వెనక్కి వాల్చి, కళ్ళు మూసుకుని తలంటించుకోవడానికి సిద్ధమైనప్పుడూ, లంకంత తెల్లటి పరుపుమీద ఓ మూల ఒదిగి అమాయకంగా నిద్రపోతున్నప్పుడూ, ఆ ముఖం చూస్తూ ఆవిడ బహు మురిసిపోయేది. చిట్టితండ్రికి ఏ అందాలరాణిని సృష్టించాడో దేవుడు ? ముక్కూ మొహమూ తీరుగా వున్న కోడలైతే తప్ప నాకు పనికిరాదు అనుకునేది. అలా అనుకోవడమే కాక ఆడపిల్లల తండ్రులు అర్జీలు పంపుకున్నపుడు ప్రతిపిల్ల అందానికీ వంకలు పెట్టి కొడుకుదాకానన్నా రానీయకుండా తోసిపారేస్తుండేది. తత్ఫలితంగా ప్రకాశరావుకు తగినపిల్ల భూమ్మీద ఇంకా పుట్ట లేదేమో అని, అయినవాళ్ళూ కానివాళ్ళూ అనుమానిస్తూండేవారు.

కాలం నాలోకూడా చాలా మార్పుల్ని తెచ్చింది. ప్రకాశరావు బియ్యేల్ అంతు కనుక్కుంటున్న రోజుల్లోనే, చెప్పుకోదగ్గ విశేషం ఏమీ లేకుండానే నేను ఎమ్మే ముగించుకుని, జీవితరంగంలోకి ప్రవేశించాను ఉద్యోగరీత్యా పుట్టినదేశానికి కొన్ని వందలమైళ్ళు దూరంగా విసిరి వేయబడ్డా, పుట్టినగడ్డమీద మమతా, చిన్ననాటి స్నేహాల స్మృతులూ నన్ను వదలడం జరగలేదు. అటువంటి ఎన్నో స్మృతులమధ్య ప్రకాశరావు ఒక చెఱగని స్మృతిగా నిలిచిపోయాడు. ఎప్పుడు గుంపులు గుంపులుగా ఆడపిల్లలు నడుస్తూండడం చూచినా, ప్రకాశరావు ఊహాసుందరి వీళ్ళల్లో ఒకటి కాకూడదా అనిపించేది. రీవిగా, కాల రెత్తుకుంటూ పక్కవాళ్ళతో డచ్చీలుకొడ్తూ నడిచే అందమైన అబ్బాయిల్ని చూచినప్పుడల్లా, ప్రకాశరావే నా మెదడంతా ఆక్రమించేవాడు——

మూడు సంవత్సరాలు మనవైపులకు రాకుండా బొంబాయి మహాపట్టణంలోనే ఉండిపోవడం అనేది నాకు నిజంగానే ఒక అనుభవమైంది. మా ఆవిడ పెట్టే పోరు ఇంతా అంతాకాదు. "యాంత్రికంగా తిండీ, పనీ, నిద్రా అంటూ ఏవిటండీ యిదీ ? సరదాగా అలా బయటికి పోయొద్దామన్నా టాంగాల్లో, రైళ్ళల్లో, టాక్సీల్లో అవతల కొంపలు ముంచుకు పోతున్నట్లే ఎక్కడ చూచినా తోసుకుంటూ, ఒకటే మనుషులు ? — ప్రాణం వెర్రెత్తిపోతోంది. మీరు రాకపోతేమానె. నన్నైనా పంపండి" అంటూ ప్రతిరోజూ ఉపన్యాసాలు దంచడం మొదలుపెట్టింది. అది ఆడదికాబట్టీ, ఆది కోరిన కోరికల్ని తీర్చి అడిగిందల్లా చెల్లించడానికి నేనున్నా కాబట్టీ దానిగొడవ అది వెళ్ళబోసుకునేది. నేనెవర్తో చెప్పుకోను ! నిజానికి నాకూ అలానే ఉంది బ్రతుకు. శుద్ధ యంత్రవతు; ఇంట్లో పెళ్ళామూ, తిండీ, నిద్రా, బయట ప్రిన్సిపాలూ, పిల్లలూ, గొడవా !

''ఒక్కదాని కేం ఖర్మ! నా గుడ్డలు కూడా సర్దు. సెలవ రాసి పారేస్తాను!'' అన్నాను ఉన్నట్టుండి. మా ఆవిడ ముఖం పున్నమనాటి చంద్రబింబమే అయింది. భారతదేశపు రైలుబళ్ళలో పడవలసిన అవస్థంతా పడి మర్నాడు మా వూరు చేరుకున్నాం. అవవలసిన పరామర్శలూ, ఇన్నాళ్ళనుంచీ మా దయ కలగనందుకు పడవలసిన నిష్ఠూరాలూ, ఆ తతంగ మంతా యథాతథంగా జరిగిపోయింది. ఊళ్ళో ఈ మధ్య కాలంలో జరిగిన మార్పులూ, తీర్పులూ చూచుకుంటూ మెల్లగా ప్రకాశరా వింటికి నడిచాను. ఎట్లా ఉన్నాడో? వాడికీ నాకూ ఈ మధ్య ఉత్తరాల్లేవు. గొప్ప లాయరై పోయాడు గాబోల్ను. వాడి ఊహాసుందరి ఇంతకీ కనపడిందో లేదో? అనుకుంటుండగానే, వాడి గుమ్మంలో కాలుపెట్టడం జరిగింది. ఎంకంత ఇల్లు బోసిగా ఉంది.

''ప్రకాశరావ్!'' అంటూ రెండు మూడు మాట్లు పిలిచిన పిలుపుకి 'ఎవరూ?' అంటూ పద్మావతమ్మగారు ఎదురుగా వచ్చింది.

''నువ్వా, నాయనా? చాలా రోజు లయింది. ఎప్పుడు రావడం?'' అంటూ మర్యాద చేసింది.

''ప్రకాశరావు లేడాండీ?''

ఆవిడ ఒక్క క్షణం దిగాలు పడిన ట్లయిపోయి రెప్పలు రెండుమూడుసార్లు అల్లార్చి క్షణం కళ్లు కిందికి దించేసు కుంది.

నా కదోలా అయిపోయింది. ఏమిటి? ఏం ఉపద్రవం జరిగింది? ఇంటి దగ్గర కనుక్కునైనా వచ్చానుకాను అని నొచ్చుకున్నాను. ఇంతలో ఆవిడే, "నీకు తెలీదా నాయనా! మీ వాళ్ళయినా రాయలేదు కామోసు!" అన్నది

"ఏమిటండీ! ఏం జరిగింది?" అన్నాను గాబరాగా. గాబరా అంతా నా మాటల్లో వ్యక్తమయింది కామోసు, ఆవిడ చిన్నగా నవ్వి.

"మరేంలేదు నాయనా! ఈ మధ్య చాలా జరిగింది. వాడూ, వాడి పెళ్ళామూ సుఖంగా ఉన్నారులే!" అన్నది.

'పెళ్ళామా? ప్రకాశరావుకి పెళ్ళయిం దన్నమాట. ఓరి పిడుగా, కనీసం నాకు శుభలేఖయినా పంపించకుండా ఊహా సుందరిని పట్టేశా డన్నమాట!' అని ఆశ్చర్యమూ, తొందరాకలిసిన గొంతుతో, "పెళ్ళెప్పుడండీ, అవుతా?" అన్నాడు.

"నిరుడీ రోజుల్లో! వాడు నీకు శుభలేఖన్నా వెయ్యలేదు గాబోలు. అది వాడితప్పు కాదులే నాయనా! పెళ్ళలా జరిగింది. తంత్రాల మీదా, నిమిషాల మీదా జరిగింది గాని అది మామూలు పెళ్ళా?" అన్నది.

"ఇంతకీ ప్రకాశరావు ఊళ్ళో లేడా?" అన్నాను ధైర్యం చేసి, లోపలి గుమ్మాల వేపు ఆఊహా సుందరి జాడ కోసం

ఆశగా చూస్తూ. "ఊళ్ళోనే ఉన్నాడు. ఇప్పుడు వాళ్ళిద్దరూ వేరే కాపరం పెట్టారు. కస్పానారి వీధిలో నాలుగో నెంబరు ఇల్లు. అలా చూసి వెళ్ళు నాయనా," అన్నది ఆవిడ.

నిరుడు పెళ్ళయి అప్పుడే వేరింటి కాపరమా? అంతే. కొందరు మనుషులు కోరి బాధ్యతలు నెత్తి నేసుకుంటారు. అది ఆ కోడలి మనసు కాబోలు. ఇక నే నేమీ ప్రశ్న అడగ లేదు. పద్మావతమ్మ గారు తెచ్చిచ్చిన కాఫీ చప్పరిస్తూంటే, ఆవిడ ఏదో చెప్పా లనుకుని మానేసి నట్లుగా రెండు మూడుసార్లు అయి పోయింది. తర్వాత నేనే వచ్చేశాను ఇక ఆ పేట్టికి నాకు ఆ కస్పా వారి వీథికి పోబుద్ధి పుట్టలదు.

ఇంట్లో భోజనాల దగ్గర ఆమాటా ఈ మాటా వచ్చి చివరకు సంభాషణ ప్రకాశరావు మీదికి మళ్ళింది. "వాడా! వాడు త్త ట్రాష్టుడు." అనేశాడు మా బావ. మా బావంటే, వాడు మా మేనమామ కొడుకు, కొడుకు కడుపు చేత్తోపట్టుకుని దూరదేశాలకు పోతే, అమ్మకూ నాన్నకూ కొడుకై వ్యవహారాలు చూచిపెట్టేవాడు వాడే, వాడు ఇంట్లో రాజ్యం చేస్తే, వాడి చెల్లెలు నాజీవితాన్నే ఏకచ్ఛత్రంగా ఏలు తోంది "అదేం? పెళ్ళి చేసుకుని వేరు కాపురం పెట్టాడనా అంటా?" అన్నాను.

"వాడిమొహం. వాడు వేరుపోవడ మేమిటి? ఆ మ్మ డు పో యా డు," అన్నాడు.

నాకు తలాతోక అర్థంకాలేదు. అసలు కథకు మొదలే అందక పోతే మధ్య ముక్క లేం అర్థాన్నిస్తాయని? ఒక్క సారే, మాబావని, ఆపళాన ఆపి పెళ్ళి దగ్గర్నుంచీ అసలుకథ మొదట్నుంచీ మొదలుపెట్టి చెప్పమనవచ్చు గానీ, వాడు చెప్పడు. వాడి కలా చెప్పడం జీవితంలో చేతకాదు. వాడికి మొదటినుంచీ సస్పెన్స్ ఇష్టం. వాడి జీవితమే ఓ సస్పెన్స్ దాంలో వాడు బావుకునే దే మిటోగాని, ఎదుటివాళ్ళను హైరానపెట్టి తాను గొడవ పడుతూంటాడు. నేను మళ్ళీ ఏ వీ అడ క్కుండా ఊరుకోవడం చూచి వాడే అందుకున్నాడు.

"చేతులో విద్యున్నవాడూ, మూతి మీద మీసం ఉన్నవాడూ ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూచుని పెళ్ళాం ఆస్తిమీద ఆధారపడతాడ్రా! నువ్వే చెప్పు!" అన్నాడు.

నాకు నవ్వొచ్చింది. ఈ రోజుల్లో మూతిమీద మీసా లెవరికున్నయ్? రోజూ గడ్డం గీసుకుంటూ కత్తిరించుకుంటుంటే ఎగుడు దిగుళ్ళొస్తున్నాయని అవస్థ పడలేకే నామటుకు నేను మీసాలు పూర్తిగా తీసేశాను

"ఇంతకీ ప్రకాశరావు కోర్టు వ్యవ హారాలు చూసుకో డంటావా? వాడు పెద్ద లాయరవుతా డనుకునేవాణ్ణే!"

"నువ్వేం? వాణ్ణి తెలిసిన ప్రతివాడూ ఆమాటే అనుకున్నారు. కాని పెళ్ళయింది ఆ ఆశ సన్నగిలింది!"




"ఇది వేకెన్సీ బోర్డు కాదు. నాటకం ఎడ్వర్టైజ్‌మెంటు !"

"ఒరే బావా ! నువ్వు సస్పెన్స్‌లో పెట్టి నన్ను చంపకు. ముందా పెళ్ళి కూతురు వివరాలు చెప్పు – ఆ షరతుమీద అయితేనే ప్రకాశరావు కథ నీనోటిద్వారా వింటాను లేకపోతే, సరాసరి ప్రకాశరావునే అడిగి తెలుసుంటాను." అన్నాను కాస్త విసుగు తెచ్చిపెట్టుకుని.

వాడు నవ్వుతూ,

"వెళ్ళు, వెళ్ళు ! కాని వాడు నీతో మునపటిలాగా మాట్లాడతాడనుకుంటున్నావేమో ! నీతో మాట్లాటబోయే ముందు, ఏం మాట్లాడాలో ఆవిడచేత చెప్పించుకుని మరీ మాట్లాడ్తాడు." అన్నాడు

ఈసారి నిజంగా ఆశ్చర్యం వేసింది. పెళ్ళయి ఏడాది తిరిగేలోపల భర్తనంత కొంగును కట్టుకుతిరిగే ఆవిడ స్త్రీ శక్తికి ముచ్చటకూడా వేసింది.

మాబావే మళ్ళీ అందుకున్నాడు.

ఇదివరకు ఎన్ని సంబంధాలు వచ్చినా ఆవంకా యీవంకా పెట్టేదా. కాలం గడిచినకొద్దీ పద్మావతమ్మకు కొడుకు పెళ్ళి కాదేమోనని దిగులుపట్టుకుంది. చెరువులో గాలంవేసినట్లుగా, దేశమంతా వెతికించింది. చివరకు గాలానికి చిక్కింది ఈచేప. నిజానికి అమ్మాయే గాలం. మనవాడే చేప !" అన్నాడు.

"అమ్మాయి అందమైందేనా ?"

"చెప్పానుగా : పిల్ల చామనచాయ. సన్నటివాళ్ళల్లో లెఖ్ఖకాదు పొట్టి. పద్మా పతమ్మమాత్రం కోడలు మొహం కళ గలదే అంటుంది. ప్రకాశరావుకు బహుశా ఆ పిల్లలో ఆకర్షణల్లా ఆవిడ ఆస్తిపాస్తు లయిఉంటాయి.

"ప్రకాశ రావంతకు దిగజారేడా? వాడి కేం తక్కువ? ఆస్తికోసమని తన ఊహాసుందరినికూడా వదులుకున్నాడా?" అన్నాను బాధపడుతూ.

"ఈ రోజుల్లో అందాలూ, ఆదర్శాలూ ఎవరికి కావాలిరా? అందరిలాంటివాడే వాడూనూ. ఎంత అందమైనా, రోజూ కనిపించే భార్యతో ఉంటే ఏవందం? ఊళ్ళో టాజమహలుంటే రోజూ చూస్తావా నువ్వు? డబ్బుంటే బాంక్‌లో ఎకౌంటుంటుంది. నలుగుర్లో నీవన్న మాట చెల్లుతుంది," అన్నాడు.

"ఆవిడి కేమాత్రం ఆస్తి ఉందేవిటి?" అందించాను నేను.

"ఆవిడ పేర్న బాంక్‌లో నలభై వేలు, కట్నరూపేణా పెళ్ళికొడుకు చేతులో పడ్డ డబ్బు పదివేలు, జల్సాగా తిరగడానికి పన్నెండు వేలు చేసే కారు. ఇంతేకాదు సుమా, నెలకు ఆరువందలు అద్దెలువచ్చే మూడిళ్ళకూ, ఏభై వేల రొక్కానికీ యజమానురాలైన పెళ్ళికూతురి తల్లీ :" అని ఊరుకున్నాడు.

"ఆవిడకు అన్నదమ్ములూ, అప్ప చెల్లెళ్ళూ లేరా ?"

"లేరు. తండ్రి చిన్నప్పుడే పోయాడు. నిజానికి ఆ అమ్మాయికంటే ఆకర్షణీయంగా ఉండే దెవరు చెప్పు ?"

దగ్గర్లో కూచుని మా సంభాషణంతా వింటున్న మా ఆవిడవేపే నా చూపులు అప్రయత్నంగా తిరిగాయి. అది నా కేం కట్నం తెచ్చింది? ఆస్తిపాస్తులు లేని మేనమావకు పెద్దకూతురు కదా అని దాన్ని చేసుకున్నాను. అది నాకు ఆకర్షణీయంగా లేదూ : ముగ్గురు పిల్లల తల్లి అయికూడా, అది కనపడ్డం ఒక్క క్షణం ఆలస్యమైతే నాప్రాణం కొట్టుకుపోతుంది.

"ఆవిడతల్లి, కూతురు దగ్గరే ఉంటుంది. అట్లా ఉండేట్టు పెళ్ళి చేసుకునే ముందు ఒప్పందంకూడా జరిగింది :"

ఇప్పుడు చిక్కు విప్పినట్టుగా తేలిపోయింది సమస్య. ప్రకాశరావు వేరుపోవడమనే ప్రసక్తేముంది? ప్రకాశరావు ఇల్లరికం వెళ్ళాడు.

అయితే ఇన్నాళ్లూ వెతికి పద్మావతమ్మ తన కొడుకును ఇల్లరికం ఇచ్చిందన్న మాట : ఇక దానికి దిగు లెందుకు :— సరేగానీ, మరి "వాడు కోర్టుకు పోవడం ఎందుకు మానేసినట్టూ ?"

"సుఖంగా రోజులు గడుస్తూంటే ఒళ్ళు ఎవరైనా హైరానా పెట్టుకుంటారట్రా :"

నిజమే; నాకు మరోసంగతి జ్ఞాపకం వచ్చింది. ప్రకాశరావు క్లాసులో నోట్సు రాసుకునేవాడుకాడు. ఎవరి దగ్గర

నుంచన్నా అరువుతెచ్చుకుని చదివేవాడు. పుస్తకాలు పూర్తిగా చదవకుండా గైడ్సు చదివి పరీక్ష కెళ్ళేవాడు. చదవవలసిన పుస్తకాలు ఆరుంటే మూడు చదివి మూడు ఛాయిసు కొదిలేసేవాడు. వాడి కన్ని విషయాల్లోనూ కష్టపడకుండా సూక్ష్మాలు వెదకడం అలవాటు. ఇందులోకూడా ఆ పనే చేశాడు. వింతేముంది? ఇక వివరాలు మావాణ్ణి అడగలేదు. ప్రకాశరావు కబుర్లకు ఫుల్‌స్టాప్‌పెట్టి ఇతర విషయాల మీదకు విరుచుకుపడ్డాం. కాని ఆ రాత్రి నిద్ర ముంచుకొచ్చేవరకూ నా బుఱ్ఱలో ప్రకాశరావూ, అతని సహధర్మచారిణీ మెదులుతూనే ఉన్నారు. అవిణ్ణి చూడాలి, అవిణ్ణి చూడాలి అంటూ నా మెదడు పరిగెత్తే రైలింజనులా ఘోషపెడుతూనే ఉంది.

కస్పావారివీధిలో నాలుగో నెంబరు ఇంటి గుమ్మంలో అడుగుపెట్టగానే, ఓ సీమజాతి బొచ్చుకుక్క ఎదురైంది. ఇల్లు విశాలమైన అవరణం మధ్యగా ఘన కార్యం చేసిన మానవుడి వ్యక్తిత్వంలాగా హుందాగా ఉంది. అపరిచితవ్యక్తినిచూచి కుక్కపెట్టిన మొర విని కాబోలు టామీ అంటూ బయటికివచ్చిన వ్యక్తి మరెవరో కాదు, మా ప్రకాశరావే.

"ఎప్పుడొచ్చావురా ?" అంటున్న అతనివేపు ఓ చిరునవ్వు విసిరి ఏవో ఆలోచనల్ని తప్పుకుంటున్నాను. మనిషి బాగా మారాడు. నునుపు తేలి శరీరం మెరుగెక్కి డబ్బులోని సుఖాన్ని వెల్లడి చేస్తోంది. వాడి కళ్ళు ఎప్పుడూ లోతుగా ఏదో ఆలోచిస్తున్నట్టే ఉండేవి. ఈసారి ఆ కళ్ళు మరీ లోతుగా నీడలు పారిఉన్న ట్లనిపించినయ్. ఏమి నీడలో అవి ! ఈ రకంగా నా మెదడు ఆలోచిస్తుంటే, దానితో సమానంగా, వాడిలో ఈ వూరు నే నెప్పుడు వచ్చిందీ, అంతకు ముందు రోజు నే నెక్కడకు వెళ్ళిందీ, ఆ వివరా లన్నీ చెప్పిఉంటాను. అదంతా యంత్ర వతుగా జరిగిందని, వాడు నన్ను లో.లికి తీసుకెళ్ళి అధునాతనంగా అ.ంకరించిన డ్రాయింగ్ రూములో, ఓ సోఫాలో కూర్చోపెట్టేవరకూ తెలియలేదు

ఎదురుగ్గా గోడకు పెద్దసైజు ఎన్‌లార్జ్ చేసిన ఫోటో ఒకటుంది. మా బావ వర్ణించినచాయ తెలీలేదుగానీ, అమ్మాయి బొమ్మ పొట్టిబొమ్మే సన్ననైందని చెప్ప డానికి కూడా వీల్లేదు. కాని ఆ ఫోటో చూస్తుంటే తేలికభావ మేమీ కలగలేదు.

"ఏమిట్రా అలా చూస్తున్నావ్ ? క్షమించరా ! శుభలేఖకూడా పంపడానికి వ్యవధిలేనంత తొందరగా జరిగిపోయింది మాపెళ్ళి. మనిద్దరిమధ్య ఉత్తరాలు లేవు కదా ! ప్రత్యేకించి రాయాలంటే ఏవిటో బద్ధకం.."

"నిన్న మీ అమ్మగారు చెప్పారులే. సాయంకాలం ఇంట్లో ఉంటావో లేదో అనుకున్నాను. నా అదృష్టం బాగుంది !" అన్నాను మాట మార్చాలని.

''ఓ పావుగంట ఆలస్యంగా వస్తే అవీ నిజమే అయ్యేది.'' అన్నాడు. ఎదురుగ్గా గుమ్మంలో జూలు సింహంలా నిద్ర పోతున్న కారూ ఆమాటే చెబుతోంది.

"అయితే నాకు పావుగంటే నన్ను మాట జైము కొలతి!'' అన్నాను సందేహమూ మందహాసమూ మిళా యిస్తూ.

వాడు మొదట తటపటాయించాడు. తర్వాత దాన్ని కప్పి పుచ్చుకోవాలని గాబరాపడ్డాడు.

ఆతర్వాత,

"ఛ, అదేంమాటరా! ఆమాట కొస్తే ఇవ్వాళ మా ప్రోగ్రామ్ కాన్సిల్! మన ప్రోగ్రాం ఉంటే ఏదన్నా వెయ్!" అన్నాడు జోరుగా.

"మనం అంటే మన మిద్దరమూ అనా! మీ శ్రీమతిగారికి ఘోషావంటి దేమీ అమలుపరచడం లేదుకదా!''

దానికి వాడు గాలివానలా పెద్దగా నవ్వి, అదేం లేదోయ్. ఆవిడ బియ్యే పాస యింది. అయినా యీరోజుల్లో ఘోషాలు మగవాళ్ళకా ఆడవాళ్ళకా?'' అని ఎదురు ప్రశ్న వేశాడు. వాడు చదువుకునే రోజుల్లో సరిగ్గా ఇలాగే నవ్వేవాడు. వాళ్ళూ వీళ్ళూ చెప్పిన మాటల్నిబట్టి వాడిలా నవ్వగలడనుకోలేదు. నవ్వుతూ న్నప్పుడు ఆ మొహం చూస్తూనే ఉండి పోయాను. కళ్ళల్లో ఇదివరకు కనిపించిన నీడలు వెనకవడ్డా యనిపించింది. బహుశా ఆప్తమిత్రుణ్ణి కలుసుకో గలిగినందువల్ల వచ్చిన వెలుగా దీనికి కారణం? లేక నీడ లున్నట్టు యనుకోవడంనా భ్రమవల్లనా? ఇద్దరమూ ఓ పది నిముషాలపాటు అవీ యివీ మాట్లాడుకుంటుండగా లోపల్నుండి అస్పష్టంగా ఏవోమాటలు వినిపించ సాగాయి.

"సమయానికొస్తా రెవరో ఒకరు!"

"ఏం ఉన్నా లేకపోయినా స్నేహితులకి కొదవలేదు.''

ఎవర్నిగురించి? నన్నేనా? ప్రకాశ రావు మొహంలో రంగులు చకచకా మారడం మొదలుపెట్టాయి మనిషి ఎవరో వీపుమీద చురుక్కుమని తగిలించిన ట్లయిపోయి,

''లతా! ఓసారిలారా!'' అని పిలిచాడు. ఆవిడ వచ్చింది. ఆ మొహం ప్రశాంతంగా ఉన్నట్లు నాకన్పించ లేదు. బొమ్మలో అనిశ్చితంగా ఉండి పోయిన చాయ తెలిసింది చామన చాయే. వాళ్ళత్తగారు కోడలి కళ్ళల్లో కళ ఉండదనుకుంటే, ఆవి దేమంత పొరబాటు పడలేదనే నాకూ అనిపించింది. ఆవిడ అందగత్తె కాదేమో గానీ, అంద వికారి మాత్రం కాదు

"ఈవిడేనోయ్! — వీడు మా స్నేహి తుడు లతా! పేరు శంకరం బొంబాయిలో లెక్చరరుగిరీ వెలగ పెడ్తున్నాడు. మూడేళ్ళ తర్వాత ఇన్నాళ్ళకి నిపించాడు.



నేను నిలబడి నమస్కారం చేశాను ఆవిడ ముభావంగా ప్రతినమస్కారం చేసి కూర్చుంది. కొన్ని నిమిషాలపాటు నిశ్శబ్దం మా మధ్య రాజ్యం చేసింది. మావాడి కళ్ళల్లో మాయమైం దనుకున్న నీడ మళ్ళీ దట్టంకా పాకిన ట్లయింది. ఆవిడ సోఫామీద కూచుందా ముళ్ళమీద కూచుందా? ఇట్లా ఆలోచించడంలో ఏమన్నా నిజముందా? లేకఅంతా, ఉత్త కల్పనా? ఛ! ఈ దంపతులసంగతివాళ్ళా వీళ్ళూ చెప్పగా వినకుండా రావలసింది. అనుకుంటూ నిశ్శబ్దాన్ని భంగంచెయ్యాలని, "సేహిత్నుణ్ణే కానండి, కనీసం పెళ్ళి శుభలేఖన్నా పంపించాడు కాడు నాకు!" అన్నాను.

"ఆయన తీరే అంత !" అన్నది ముక్తసరిగా ఏ ఫీలింగూ చూపెట్టకుండా ! – ఏమిటీ జవాబు, భర్తను వెనకేసుకు రావడమా ? ఎద్దేవా చెయ్యడమా? ఇంక మళ్ళీ ఏం మాట్లాడను ? మావాడు నిస్సహాయంగా చూపులు తిప్పుతున్నట్లనిపించింది ?

"ఎక్కడికో వెళ్ళే ప్రయత్నంలో ఉన్నట్టున్నారు," అన్నాను, నూటికి నూరుపాళ్ళు 'అ దాం దేముందిలెండి' అంటుం దని ఆశపడుతూ.

"అవునండీ ? మా అమ్మగార్ని చుట్టాలింటిక్కి తీసుకెళ్ళాలి. అయిదింటికి వస్తున్నామని వాళ్ళకు ఫోన్ చేశాం. అప్పుడే నాలుగున్నర దాటింది," అన్నది, తన వాచ్ వేపొక సారి చూచి. అంతకు ముందు ప్రకాశరావు ప్రోగ్రామ్ గురించి మాట్లాడిన మాటలు నన్ను వెక్కిరించడం మొదలుపెట్టినయ్. ఇక వీడు జీవితంలో ఆ అమ్మాయికి తెలీకుండా ఇతరుల కిచ్చిన మాటల్ని ఆవిడ పక్కన ఉండగా నిలబెట్టుకోలేడు. అది కఠోర సత్యం. —— ఇక నే నెందు కిక్కడ ?

"వస్తానండీ !" అంటూ లేచాను. మావాడు గేటుదాకా వచ్చాడు.

"ఏమీ అనుకోకురా ! ఇంకా ఎన్నాళ్ళుంటున్నావ్ ?" అన్నాడు.

ఎన్నాళ్ళుంటేమాత్రం వాడికి ఒరిగే దేముంది ? భోజనానికి రమ్మన్నా, కులాసాగా కబుర్లు చెప్పుకుందాం రమ్మన్నా నమ్మి మోసపోయే స్థితిలో ఉన్నానా నేను ? పాపం వాడి కెందు కీ అడుగడుక్కీ అపజయాలు. మర్నాడే వెళ్ళిపోతున్నాననీ, మళ్ళీ వాణ్ణి కలుసుకోవడం పడదేమో ననీ చెప్పాను. వాడు దానికి మౌనంగా ఉండిపోయాడు.

చిత్రం ! అందం, అణకువ, మంచితనం కలిగి అడుగడుక్కూ తన భవిష్త్తులో మెరిసిన ఆ బొమ్మకంటే ఈవిడే మావాడికి ఆకర్షణీయంగా ఉందేమో ! బయటికి అడపా దడపా ఇటువంటి సంఘటనలు అవాంఛనీయంగా కనిపిస్తున్నా, ఆంతర్యంలో, ఆ డబ్బూ, ఆ భార్యా అతనికి నిజంగా ఆనందాన్నిస్తున్నాయేమో ! భర్త మిత్రుణ్ణి పరిస్థితుల ఒత్తిడివల్ల ఆదరించలేక పోయినంత మాత్రాన ఆవిణ్ణి గురించి క్రూరంగా నేనెందు కాలోచించాలి ?

ఇటువంటి ఆలోచనల జాలాన్నుండి నన్ను సులువుగానే తప్పించుకున్నాను; గాని ఒక్కటి మాత్రం నన్ను విడిచి పెట్టలేదు. ఇన్నాళ్ళూ గుంపులుగా రోడ్డు మీద పోయే అమ్మాయిలు కనపడ్డా, నీటుగా ముస్తాబయిన అబ్బాయిలు కనబడ్డా ప్రకాశరావు జ్ఞాపకం వచ్చేవాడు. ఇప్పుడు ఎవరింటోనైనా తోకాడిస్తూ ముద్దొచ్చే ఓ చిన్న బొచ్చుకుక్క ఎదురైతే మా ప్రకాశరావే జ్ఞాపకం వస్తాడు. ఈ జ్ఞాపకాల వలయం నుంచి ఎలా తప్పించుకోవడం ?